# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పోలవరం నిర్వాసితులను అన్ని విధాల ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 97.52 కోట్ల రూపాయలను విడుదల చేసింది.
- వికసిత్ భారత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి విజన్ 2047ను రూపొందించారని మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

=======================

పోలవరం నిర్వాసితులను అన్ని విధాల ఆదుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ రోజు ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రాజెక్టును త్వరలో పూర్తి చేసి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్వాసితులందరికీ న్యాయం జరిగిన తర్వాతే ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తామన్నారు. పేదవాళ్ళకి న్యాయం జరిగి పునరావాసం కల్పించే దిశగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రవేశపెట్టామని తెలియజేశారు. రైతాంగాన్ని అన్ని విధాలు ఆదుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే సంకల్పంతో పనులు చేపట్టామని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

అనంతరం ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

======================

బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 97.52 కోట్ల రూపాయలు విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 పథకం కింద నిధులు మంజూరు అయ్యిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో  సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి కందుల దుర్గేశ్.. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి బీచ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు.

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 నాటికి సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధికి నమూనాగా రూపొందిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈ రోజు విజయవాడలో  స్వర్ణాంధ్ర 2047పై జరిగిన ఒక కార్యశాలలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... విజన్ 2047లో 10 సూత్రాల అమలుతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటుందని, ఆ సమయానికి రాష్ట్రాన్ని మురికివాడల రహితంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్-2047ను రూపొందించారని మంత్రి నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

======================

ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ఆప్కోలో వస్త్రాలు కొనుగోలు చేసేవారికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం రాయితీ ఇవ్వనుందని విజయనగరం డివిజన్ ఆప్కో మండల వాణిజ్య అధికారి బి. హరి ప్రసాదరావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయశాలల్లో ఈ రాయితీలు లభిస్తాయన్నారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయశాలలను  సందర్శించి తమకు కావలసిన వెంకటగిరి, మాధవరం, రాజమహేంద్రవరం, బందర్, చీరాల, ఉప్పాడ చీరలు మొదలగు వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

======================

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియ చట్టపరమైన సూత్రాలకి కట్టుబడి నిర్వహించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టీ నిషాంతి తాసిల్దార్లు, ఉపతాసిల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలకు పిలుపు నిచ్చారు. జిల్లాలోని మూడు డివిజన్లకు చెందిన అధికారులకు అమలాపురం కలెక్టరేట్ లో ఈరోజు రీసర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పైలెట్ కార్యక్రమం దాదాపుగా పూర్తికావస్తుందని రెండవ దశలో ప్రతి మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ శిక్షణలో పైలెట్ గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఉత్పన్నమైన సమస్యల దిద్దుబాటు, వెబ్ లాండ్, మొబైల్ అప్లికేషన్ డేటా ఎంట్రీ తదితర అంశాలపై శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. రీ సర్వే ఉద్దేశ్యాన్ని భూయజమానులకు తెలియజేయాలని గతంలో

జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూ రీసర్వే కార్యకలాపాలను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

======================

ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంపై తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఎంపీడీవో పఠాన్ రఫీ ఖాన్ తొండమనాడు గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను ఈరోజు పరిశీలించారు. ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న వారికి ఎటువంటి సదుపాయాలకు అందిస్తురన్న విరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు మజ్జిగ మంచినీళ్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

కందుకూరి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ఏప్రిల్ 16న ప్రదానం చేయునున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టీవీ నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల తెలియజేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కందుకూరి వీరేశలింగం పంతులు గారి 177వ జయంతిని పురస్కరించుకొని నాటక రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులు, రచయితలు, దర్శకులకు తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా పురస్కారాలను ప్రధానం చేయనున్నామ తెలిపారు. ఈ పురస్కారాలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ధరఖాస్తులను వచ్చే నెల 7వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు.

======================

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను ప్రభుత్వం రాష్ట్రస్థాయి పండుగగా ప్రకటించడంతో అధికారులు ఈ మేరకు విస్తృత ఏర్పాట్లను చేస్తున్నారు. నెల రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, చేతివృత్తుల స్టాళ్లు వంటివి ఏర్పాటు చేయడానికి ఆలయం వద్ద తగినంత స్థలం లేకపోవడంతో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా స్టేడియం ప్రవేశ మార్గం వద్ద నూకాంబిక అమ్మవారి 12 అడుగుల ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. వేదికపై నెల రోజుల పాటు ప్రతి రోజూ కోలాటాలు, జానపద నృత్యాలు, సంకీర్తనలు, భరతనాట్యం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్టేడియంలో చేతివృత్తులు, హస్తకళల ప్రదర్శన అమ్మకాల కోసం స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

======================

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ఉత్తర - దక్షిణ ద్రోణి ఈరోజు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దిగువ ట్రోపో ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ యానాం లలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

======================
======================